ప్రజాశక్తి

గురువారం 2 జనవరి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అరుదైన అతిథుల మృత్యుఘోష



భీమిలి తీరానికి కొట్టుకు వచ్చిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు

- విశాఖ తీరంలో పెద్ద ఎత్తున ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు
- మానవ తప్పిదాలు, కాలుష్యం కారణం
- మెకనైజ్డ్ బోట్ల వలల్లో ఇరుక్కుపోతున్నాయి : అటవీ అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అలుపెరగని ప్రయాణం ఆ జీవుల జీవన శైలి. సైబీరియా పక్షుల మాదిరిగా కేవలం సంతానోత్పత్తి కోసమే వేల కిలోమీటర్లు అలసట లేకుండా సముద్రంలో ప్రయాణించి తమ పుట్టినిల్లుగా ప్రసిద్ధికెక్కిన విశాఖ తూర్పు తీరానికి చేరుకోవడం రివాజు. అటువంటి అరుదైన అతిథులు ఆలివ్ రిడ్లే తాబేళ్లు నేడు మృత్యువాత పడటం అందరినీ కలవరపరుస్తోంది. పర్యావరణ ప్రేమికుల హృదయాలను ద్రవింపజేస్తోంది. 20 రోజులుగా విశాఖ తీరంలో పెద్ద సంఖ్యలో కనిపిస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మానవ తప్పిదాలు, కాలుష్యమే వీటి మృతికి కారణాలని చెప్పొచ్చు.

ఉభయచర జీవులైన ఆలివ్ రిడ్లే తాబేళ్లకు సంబంధించి డిసెంబరు చివరి వారం లేదా జనవరి మొదటి వారం నుంచి ఏప్రిల్ వరకూ సంతానోత్పత్తి కాలం. ఆ సమయంలో ఒడిశా నుంచి ఇటు విశాఖపట్నం బంగాళాఖాతం తీరం వరకూ కొన్నిచోట్ల గుడ్లు పెట్టి వాటిని ఇసుకలో గొయ్యి తీసుకుని భద్రపరుచుకుంటాయి. సముద్ర లోతుల్లోగల నీటిని శుద్ధిచేసే బయోస్కావంజర్‌లన్న నామకరణం వీటికుంది. సముద్రంలో ఉండే చెత్తనంతటినీ తిని నీటిని శుద్ధి చేయడంలో అత్యంత కీలకపాత్ర పోషించడంతో సముద్ర నీటి రక్షకులుగా ఈ తాబేళ్లను జీవావరణ శాస్త్రవేత్తలు పిలుస్తారు. రెండు అడుగుల పొడవు, సుమారు 500 కిలోల బరువు ఉండే ఈ తాబేళ్లు ఆహారాన్వేషణ, గుడ్లు పెట్టడం, సంతానోత్పత్తి కోసం ఏటా 20 వేల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వీటిలో ఏడు జాతులుండగా ఐదు జాతుల తాబేళ్లు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి లక్షలాదిగా మిగతా 2లో..

కేంద్ర కారాగారంలో సెల్ ఫోన్లపై..

దర్యాప్తు ప్రారంభం



లభ్యమైన సెల్‌ఫోన్లు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. ఉన్నతాధికారులు ఆ దిశగా విచారణ చేపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఇదే కారాగారంలోని ఖైదీలకు గంజాయి, మత్తు పదార్థాలు చేరిన విషయం బయటకు రావడం, తాజాగా సెల్‌ఫోన్లు దొరకడం వంటి

పలుకోణాల్లో విచారణ

వరుస ఘటనలతో కారాగార నిర్వహణ తీరుపై ప్రస్తుతం ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది. హై సెక్యూరిటీతో ఉన్న పెన్నా బ్యారక్ వద్దగల గార్డెన్‌లో మంగళవారం నాలుగు అడుగుల లోతులో పాతిపెట్టిన సెల్‌ఫోన్లు, బ్యాటరీ, పవర్ బ్యాంక్, కీ ప్యాడ్ లభించడంతో కలకలం రేగిన విషయం తెలిసిందే. ఈ విషయమై జైలు అధికారులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది. సెల్‌ఫోన్ల వ్యవహారంలో సంబంధిత వ్యక్తులు వాటిలో వాడిన సిమ్ కార్డులు దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సెల్ ఫోన్లు ఎప్పటి నుంచి ఇక్కడ ఉన్నాయి ? వాటిని ఎవరు ఖైదీలకు అందించారు ? సెల్ ఫోన్లు వాడిన ఖైదీలు ఎవరు ? ఎవరితో సంభాషించారు ? అన్న విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దొరికిన స్మార్ట్ ఫోన్‌లో ఉన్న ఐఎంఇఐ కోడ్ ఆధారంగా ఏయే సిమ్‌లు వాడారు, ఆ సిమ్‌లు ఏ ఆధార్‌తో లింకై ఉన్నాయి ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. హై సెక్యూరిటీ కలిగిన పెన్నా బ్యారెక్‌లో మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన కేసులోనూ, మరో హత్య కేసులోనూ మిగతా 2లో..

ఉద్యోగాల కల్పనపై దృష్టి : చిరంజీవిరావు

▶ వార్త 2లో..

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

▶ వార్త 2లో..

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

▶ వార్త 6లో..



ఎయు ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో చురుగ్గా సాగుతున్న పనులు

మోడీ పర్యటనకు ఏర్పాట్లు

ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోడీ పర్యటించనున్న నేపథ్యంలో ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇక్కడి నుంచే ప్రధాని పలు ప్రాజెక్టులను ప్రారంభించనున్న క్రమంలో అధికారులు అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. షామియానాలు, బారికేడ్లు వంటివి ఇప్పటికే సభా స్థలికి చేరుకున్నాయి.

- ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలంటూ విశాఖలో నిరసనలు కొనసాగుతున్నాయి. బుధవారం జగదాంబ పరిసర ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు, ముఠా కార్మికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ పూర్ణా మార్కెట్ వద్ద ముఠా కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎం.సుబ్బారావు, కెవిపి.చంద్రమౌళి, సిపిఐ నాయకులు ఎం.మన్మధరావు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా సాక్షాత్తు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. అమిత్‌షా బిజెపి అజెండా అయిన ప్రైవేటీకరణను సమర్థిస్తున్నారని, దీని అర్థం దేశ సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేయడమేనని అన్నారు. ఈ క్రమంలోనే రకరకాల పద్ధతుల్లో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు భారత జాతికే అవమానకరమన్నారు. కులాలను, మతాలను, చివరికి రాజ్యాంగ నిర్మాతను వివాదాల్లోకి లాగడం అత్యంత హేయమైన చర్య అన్నారు. అమిత్‌షా వ్యవహారంపై ప్రధాని మోడీ స్పందించాలని కోరారు. ఆయనపై చర్యలు తీసుకోకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాసీల నాయకులు పైడిరాజు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..



తాబేళ్ల కోసం తీరంలో ఏర్పాటు చేసిన సంరక్షణా కేంద్రం

అరుదైన అతిథుల మృత్యుఘోష

ఎపి, ఒడిశా తీరాలకు సముద్ర మార్గంలో వలస వస్తూ ఉంటాయి. సముద్రం లోతులో 80 నుంచి 100 నాటికల్ మైళ్ల దూరంలో ఇవి ఉంటాయి. అక్కడ నుంచి భూమి మీదకు వచ్చి గుడ్లు పెట్టే ఏకైక అరుదైన జాతి ఈ ఆలివ్ రిడ్లే మాత్రమే. అయితే తమ జీవన యానంలో మృత్యువాత పడుతూ ఈ జాతి అంతరించిపోతున్న వాటి జాబితాలో చేరిపోవడం కలవరపరుస్తోంది.

అంతరించిపోవడానికి కారణాలివే..

20 ఏళ్లుగా బంగాళాఖాతం అంతటా మెకనైజ్డ్ బోట్లతో చేపలవేట సాగుతోంది. వీటి వలలకు సముద్రంలోనే ఇరుక్కుపోయి ఊపిరాడక ఈ తాబేళ్లు మృత్యువాతపడుతున్నాయి. వీటి కళేబరాలు ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. ఇటీవల విశాఖ-భీమునిపట్నం తీరంలో ఇలా డజన్ల కొద్దీ ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు ఒడ్డున తేలాయి. సముద్ర తీరంలో గోతులు తీసి గుడ్లను పెట్టాక కుక్కలు, నక్కలు ఈ గుడ్లను తినేయడం, కొన్ని ప్రాంతాల్లో మనుషులు కూడా ఈ గుడ్లను ఆహారం కోసం సేకరించడం ఈ జీవులు అంతరించిపోవడానికి కారణమని చెప్పొచ్చు. పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయన జలాల కాలుష్యంతోనూ ఇవి చనిపోతున్నాయి. వీటికి స్థిర నివాసం అంటూ లేనందున ఇలా బహుముఖ దాడులకు గురౌతున్నాయని ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ రెడ్ లిస్టు ప్రతినిధులు తెలిపారు. వాలుగా ఉండే విశాఖ తీరం, ఇసుక వాతావరణం ఈ తాబేళ్లు గూడు కట్టుకోవడానికి అనువైనవిగా ఉండటంతో 1980 నుంచి ఈ ప్రాంతంలో ఎక్కువగా ఇవి సంచరిస్తున్నాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

మెకనైజ్డ్ బోట్ల వలలో ఇరుక్కుపోయి మృతి

డిసెంబరు చివరి వారం లేదా జనవరి మొదటి వారం నుంచి ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీరానికొచ్చి గుడ్లు పెడతాయి. గుడ్లు పెట్టేసి తల్లి తాబేళ్లు సముద్రంలోకి వెళ్లిపోతాయి. వీటి కోసం విశాఖ సముద్ర తీరంలో ఆర్‌కె.బీచ్, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, నాగమయ్యపాలెంల్లో నాలుగు సంరక్షణ కేంద్రాలున్నాయి. తయారైన పిల్లలు సురక్షితంగా సముద్రంలోకి వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆలివ్ రిడ్లే తాబేళ్లు భారీగా తగ్గిపోతున్నాయి. మెకనైజ్డ్ బోట్లు వలల్లో ఇరుక్కుపోతున్నాయి. వీటికి దొరకని కొన్ని తాబేళ్లు ఒడ్డుకొచ్చి గోతులు తవ్వి గుడ్లు పెడుతున్నాయి. కుక్కలు, నక్కలు వాటిని తినకుండా మేం సంరక్షిస్తున్నాం. 45 రోజులు వాటిని వెదురు కంచెల్లో భద్రపరిచి ఆ తర్వాత సముద్రంలో వదిలేస్తున్నాం. ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెద్ద ఎత్తున తగ్గిపోవడానికి మెకనైజ్డ్ బోట్లతో ఫిషింగ్ చేయడమే కారణం. వాటి వలలకు చిక్కి మృతిచెందిన తర్వాత కళేబరాలు ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. ఆలివ్ రిడ్లే తాబేళ్లను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శాస్త్రి, విశాఖ ఫారెస్ట్ రేంజర్

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు

ఆర్.నాయుడు, నర్సింగరావు, మహేష్, నారాయణ, రమణ, సంజీవ్, సాంబ, శ్రీను, సూరి పాల్గొన్నారు.

31వ వార్డులో పాదయాత్ర

అమిత్‌షా వ్యాఖ్యలపై జివిఎంసి 31వ వార్డు కృష్ణాగార్డెన్స్, భీమ్ నగర్ ప్రాంతాల్లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన నిరసన తెలిపి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు మాట్లాడుతూ అమిత్‌షా వంటి దేశద్రోహులను కఠినంగా శిక్షించాలన్నారు. తక్షణమే హోం మంత్రి పదవికి ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ నాయకులు కె.చంద్రశేఖర్, కెవిపి.చంద్రమౌళి, కె.నర్సింగరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు ప్రారంభం

నిందితుడైన రౌడీ షీటర్ హేమంత్, మరో రౌడీ షీటర్ (రిమాండ్ ఖైదీ) రాజేష్ ఉన్నారు. వారికోసమే సెల్ ఫోన్లు దాచి ఉండొచ్చని జైలు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సెల్‌ఫోన్లు చాలా రోజుల నుంచే ఇక్కడ వాడుతున్నట్టు అనుమానాలున్నాయి. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో ఇప్పటికే కేంద్ర కారాగారం పర్యవేక్షణాధికారి, అదనపు పర్యవేక్షణాధికారిపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే. విశాఖ కేంద్ర కారాగారాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకుగాను నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి ఎం.మహేష్ బాబును, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ప్రవీణ్ కుమార్‌ను ఇక్కడకు పంపించినట్టు సమాచారం. పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడితే అసలు దొంగలు బయటపడే అవకాశముంది. తాజా దర్యాప్తుతో జైలు అధికారులు, వార్డర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఉద్యోగాల కల్పనపై దృష్టి

నెల రోజుల్లో డిఎస్‌సి నోటిఫికేషన్
- ప్రభుత్వ విప్ చిరంజీవిరావు



మాట్లాడుతున్న చిరంజీవిరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువతకు ఉద్యోగాలు కల్పించడంపై దృష్టి సారించినట్టు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. నిరుద్యోగులకు 2025 స్వర్ణయుగం కావాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 15 నుంచి 20 లక్షల మంది నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు ముఖ్య మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సంతకం డిఎస్‌సిపై పెట్టారన్నారు. ఎస్‌సి వర్గీకరణ వల్ల డిఎస్‌సి నోటిఫికేషన్ రావడానికి ఆలస్యమవుతోందని తెలిపారు. జనవరి చివరలోగానీ, ఫిబ్రవరి మొదటి వారంలోగానీ డిఎస్‌సి నోటిఫికేషన్ రానుందన్నారు. రానున్న జూన్ నెలకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి విధుల్లోకి పంపించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. గత ఐదేళ్లలో కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కానిస్టేబుల్ పోస్టుల భర్తీని వేగవంతం చేసిందన్నారు. 2025లో ఎపిపిఎస్‌సి ద్వారా ప్రతి నెలలో పరీక్షలు నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ఎపిపిఎస్‌సి ద్వారా సుమారు 20 నోటిఫికేషన్లు వచ్చాయన్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పామని, ఈ క్రమంలో ఓ ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలో 820 ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. ఈ ఏడాదిలో సమయం వృథా చేయకుండా నిరుద్యోగులు చదువుకుంటే ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడతారని చెప్పారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గిస్తున్నామన్నారు. త్వరలో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగనుందని తెలిపారు.

ఇగ్నో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జనవరి - 2025 విద్యాసంవత్సరానికిగానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకు మంగళవారం ప్రకటన వెలువడింది. విశ్వవిద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని వర్సిటీ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా పొందవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఇగ్నో వెబ్‌సైట్ https:// ignou admission.samarth.edu.inలో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని, అన్ని కోర్సులలో ప్రవేశాలకు గడువు తేదీ జనవరి 31 అని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుందని, ఫీజులు ఆన్‌లైన్ ద్వారానే కట్టాల్సి ఉందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్ లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల


ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలానికిగాను స్టాఫ్ నర్సుల నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని, అందులో భాగంగా విశాఖపట్నం జోన్-1లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయనున్నామని మెడికల్, హెల్త్ డిపార్టుమెంట్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధారాణి మీడియాకు తెలిపారు. ఒక సంవత్సరం ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు 2025 జనవరి 1 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రాంతీయ సంచాలకులు, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, విశాఖపట్నంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు https://nagendrasvst.wordpress.com వెబ్ సైట్‌ను చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇది వరకే నియమితులై పని చేస్తున్న అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అనర్హులని తెలిపారు.

పోరాటాలతో ఎన్నో విజయాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిఐటియు నాయకత్వంలో అనేక ఉద్యమాలు నిర్వహించి విజయాలను సాధించి కార్మికులకు అండగా నిలిచినట్టు విశాఖ జిల్లా హాస్పిటల్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ అధ్యక్షులు వై.రాజు తెలిపారు. సెవెన్ హిల్స్ కార్మికులు కూడా అదే తీరున విజయం సాధిస్తారని అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా సెవెన్ హిల్స్ హాస్పిటల్ వద్ద బుధవారం కార్మికులు నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. నూకరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వై.రాజు మాట్లాడుతూ పాలకులు కార్మిక చట్టాలను అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. ఇది ఏనాటి నుంచో ఉందని, అంతమాత్రాన కార్మికులు వెనకకు తగ్గకుండా పోరాటాలు చేసి డిమాండ్లను నెరవేర్చుకున్నారని గుర్తుచేశారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కూనవరం : పైడిగూడెం గ్రామానికి చెందిన కందుకూరి వరమ్మ అనారోగ్య కారణంగా ఇటీవల మృతి చెందగా, ఆమె కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన ఆర్థిక సహాయం అందజేశారు. వరమ్మ మృతితో ఆమె కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు వారు స్పందించారు.



మంచు దుప్పటి

వారం రోజులుగా విశాఖ నగరంలో విపరీతంగా మంచు కురుస్తోంది. ఉదయం 8 గంటల వరకూ శీతల గాలులు వీస్తున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందుల నడుమే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ముందు వెళ్తున్న వాహనాలు కూడా సరిగా కనిపించని పరిస్థితి నెలకొంది.

జోరుగా సిమెంట్ రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలో సంక్రాంతి నాటికి రహదారుల నిర్మాణం పూర్తి చేసేందుకు మండల ఇంజినీరింగ్ అధికారులు నడుం బిగించారు. 'పల్లె పండగ' పేరుతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నవంబర్ రెండో వారంలో వారోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో 'గుంతల రహిత రహదారులు', కార్యక్రమాన్ని నవంబర్ నెలలో ప్రారంభించారు.

మండలంలోని 14 పంచాయతీల్లో 5.5 కిలోమీటర్ల మేర రూ.4.41 కోట్లతో 21 పనులు చేపట్టనున్నారు. 4 కిలో మీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకొని, అదనంగా కిలో మీటరున్నర రోడ్ల నిర్మాణ పనులు సిద్ధంచేశారు. ఇప్పటికే కొన్ని రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి.



అన్నవరంలో పూర్తయిన సిమెంట్ రోడ్డు

చిప్పాడ పంచాయతీలో రూ.15 లక్షలతో 203 మీటర్లు, లక్ష్మీపురంలో రూ.50 లక్షలతో 450 మీటర్లకు గాను 250 మీటర్లు, మూలకుద్దులో రూ.37.50 లక్షలతో 670 మీటర్లు, తాళ్లవలసలో రూ.62 లక్షలతో 800 మీటర్లకు గాను 300 మీటర్లు, రేఖవానిపాలెంలో రూ.47 లక్షలతో 750 మీటర్లు, బోడమెట్టపాలెంలో రూ.20.25 లక్షలతో 400 మీటర్లు, దాకమర్రిలో రూ.15 లక్షలతో 320 మీటర్లు, అమనాంలో రూ.22.50 లక్షలతో 400 మీటర్లు, మజ్జిపేటలో రూ.30 లక్షలతో 500 మీటర్లు, అన్నవరంలో రూ.30 లక్షలతో 500 మీటర్లు, టి.నగరపాలెంలో రూ.15 లక్షలతో 150 మీటర్లు, సింగనబందలో రూ.30 లక్షలతో 400 మీటర్లు, పెదనాగమయ్యపాలెంలో రూ.22.50 లక్షలతో 400 మీటర్లు, తాటితూరులో రూ.40 లక్షలతో 300 మీటర్లు మేర సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సంక్రాంతి నాటికి సంబంధిత పనులన్నీ పూర్తి చేయనున్నట్లు మండల ఎఇఇ పట్నాయక్ ప్రజాశక్తికి తెలిపారు.

నేరాలు ఘోరాలు

నూతన సంవత్సర వేడుకల్లో విషాదం

- మందు గుండు సామగ్రి పేలి ఒకరు మృతి

ప్రజాశక్తి -ఉక్కునగరం

నూతన సంవత్సర వేడుకల్లో మంగళవారం రాత్రి విషాదం నెలకొంది. వడ్లపూడి రజకవీధిలో మంగళవారం రాత్రి కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. సద్దుమల్ల శివ బాణాసంచా కాల్చాడు. ఒకటి పేలకపోవడంతో దగ్గరికి వెళ్లి పరిశీలిస్తుండగా అది పేలి తలకు బలంగా తగిలింది. దీంతో తీవ్ర గాయాలపాలైన శివను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దువ్వాడ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ర్యాలీ చేస్తున్న అంబేద్కర్ ఇండియా మిషన్ ప్రతినిధులు

భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 1818 జనవరి 1న దాదాపు 500 మంది మహర్ యోధులు పీష్వా సైన్యాన్ని చిత్తుగా ఓడించినందుకు గుర్తుగా భీమా కోరేగావ్ మహర్ వీరుల స్ఫూర్తితో, దళిత ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను బలోపేతం చేద్దామని తెలుపుతూ భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీ బుధవారం నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం మీదుగా డాబా గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షుడు నేతల భోగేష్ నాయకత్వంలో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

కొత్తపల్లి జలపాతానికి పోటెత్తిన సందర్శకులు

ప్రజాశక్తి -జి.మాడుగుల :నూతన సంవత్సరాదిన బుధవారం కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున సందర్శకులు తాకిడితో సందడి నెలకొంది, జలపాతంతో కేరింతలు కొడుతూ జలకాలాడారు, ఆహ్లాదకరమైన వాతావరణం ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. కొత్తగా నిర్మించిన వ్యూ పాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలతో సందడి చేశారు.

3 నుంచి జిమ్సర్ వేదికగా డిఎస్ఐ వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) డివిఎల్, పాథాలజి విభాగాల ఆతిథ్యంలో జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు డెర్మటోపాథాలజి సొసైటీ ఆఫ్ ఇండియా (డిఎస్ఐ) 27వ వార్షిక సమావేశాలను నిర్వహిస్తున్నట్లు గీతం డెర్మటాలజి విభాగాధిపతి డాక్టర్ బివి.రామచంద్ర, పాథాలజి విభాగాధిపతి డాక్టర్ జి.రాజా ప్రమీల తెలిపారు. ఈ సమావేశాలకు దేశం నలుమూలల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఛాలెంజింగ్ దా డొగ్మా అనే అంశంపై జరిగే ఈ సమావేశాలలో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. డెర్మటోపాథాలజిలో వస్తున్న వైద్య ప్రగతిపై అవగాహన, చర్చలు ఉంటాయన్నారు.

సేంద్రియ సాగు పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి. -చింతపల్లి: సేంద్రియ వ్యవసాయంలో వినూత్న పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలం గడపరాయి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎపి సిఎన్ఎఫ్ , ఆర్వైఎస్ఎస్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతపల్లి యూనిట్ ఇంచార్జ్ కొర్ర మోహన్, విహెచ్ఎ చంద్రకళ, ఐసిఆర్ పి.బొజ్జిపాడల్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ, వ్యవసాయం రసాయనిక ఎరువులు, పురుగుమందులతో కలుషితమౌతున్న పరిస్థితుల్లో సాగుకు సహజసిద్ధమైన పూర్వవైభవం రావాలన్నా, కాలుష్య రహిత వాతావరణం సిద్ధించాలన్నా సహజసిద్ధమైన సేంద్రియ ఎరువులతో సాగుచేసే ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆరోగ్యకరమైన ఆహారానికి, భావితరాలకు కాలుష్యరహిత వాతావరణ అందించేందుకు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ విధానాలను ప్రతిఒక్కరూ అవలంభించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తక్కువ భూమిలో కిచెన్ గార్డెన్స్ వేసుకోవాలని సూచించారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను తిలకిస్తున్న ఎంపిపి, జెడ్పిటిసి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టివలస డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జివిఎంసి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆలోచింపజేసింది. జివిఎంసి పిఎన్ఎం హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.జస్వంత్‌కుమార్ ప్రదర్శించిన "డిఫెన్స్ రోబోటిక్స్" నమూనాకు, మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు బి.రాకేష్, జి.సూర్యతేజ తదితరులు తయారుచేసిన ప్రదర్శించిన "ఆటోమేటిక్ రూమ్ లైట్" నమూనాలకు ప్రథమ స్థానం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ముందుగా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్యనారాయణరాజు, వైస్ ఎంపిపి బోని బంగారు నాయుడు, జెడ్పిటిసి గాడు వెంకటప్పడుతో కలిసి ప్రారంభించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల, యుపి పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రతిభ చూపి, జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఎంపిపి, జెడ్పిటిసితో పాటు ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, జయప్రద, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం జె.రాధాకుమారి పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ అనైతికం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ అనైతికమని యునైటెడ్ డాక్ అండ్ పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు అన్నారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు 93వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం అనర్హమని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధికి వైజాగ్ పోర్టు కీలకమని, ఏటా మున్సిపాలిటీకి సగటున రూ.65 కోట్లు పన్నులు కడుతున్న పోర్టును ప్రయివేటుకు ధారాదత్తం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని చెప్పారు. ఆసుపత్రి ప్రయివేటీకరణకు టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక వర్గ పోరాట ఫలితంగానే వాయిదా వేశారని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం



రిలే నిరాహార దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారయణ, జె.సత్యనారయణ, బి.జగన్, శంకరరావు, సిహెచ్.త్రినాధరావు, కెఎస్.కుమార్, శ్రీను, రాఘవులు, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి తదితరులు

రిటైర్మెంట్ పేరుతో కార్మికులను తొలగించొద్దు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో రిటైర్మెంట్ పేరుతో కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి కోరారు. జివిఎంసి వద్ద బుధవారం యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్త సంవత్సరం మొదలు 60 ప్లస్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను రిటైర్మెంట్ పేరుతో తొలగించడం దుర్మార్గం అన్నారు. కడుపుకొట్టి ఇంటికి పొమ్మంటున్న కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షులు టి.నూకరాజు మాట్లాడుతూ, విధులలో ఉన్న కార్మికులను వెంటనే ఆగిపొమ్మని చెప్పడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ ఇచ్చి, కార్మిక కుటుంబాల సభ్యులకు ఉపాధి అవకాశం కల్పించే వరకు ఎవరినీ తొలగించొద్దన్నారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యాన ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు జివిఎంసి మెయిన్ ఆఫీస్ గేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. రిటైరైన, చనిపోయిన, లాంగ్ ఆబ్సెంట్ కార్మికుల కుటుంబ సభ్యులు ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ఇ.ఆదినారాయణ, జెఆర్.నాయుడు, వెంకటరావు, మీనాక్షి, గణేష్, అనిల్, ఈశ్వరరావు, సురేష్, శ్రావణ్‌కుమార్, శేషు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-లీగల్ : ఇటీవల రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్‌చేశారు. మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ న్యాయవాది సుదర్శన్‌రెడ్డిపై అనంతపురం జిల్లా లక్కిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండారెడ్డి దురుసు ప్రవర్తనను యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఆయన అరెస్టు అప్రజాస్వామికమని, చట్టానికి విరుద్ధంగా సినిమాలో వలె వీధులలో కాలర్ పట్టుకుని లాక్కెళ్లటం సభ్య సమాజం, న్యాయవాదులు జీర్ణించుకోలేని విషయమని, దీనిపై చట్టపరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని యూనియన్ ఆలిండియా రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు బివి.రామాంజనేయరావు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా 3 టౌన్ పోలీస్ స్టేషన్‌కు సివిల్ కేసులో లాయర్ శేషాద్రికి నోటీసులిచ్చి స్టేషన్‌కు పిలిపించి దురుసుగా ప్రవర్తించారని, ఒత్తిడికి లోనై గుండెపోటుతో మరణించిన న్యాయవాదిని కనీసం 108 వాహనంలో కూడా పంపించకుండా ఆటోలో ఇంటికి పంపించడం విచారకరమని పేర్కొన్నారు. సదరు పోలీసు అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని, వారిని విధుల నుంచి తొలగించాలని, విచారణ చేపట్టి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పలు కేసులలో ఇస్తున్న సూచనలను, నిబంధనలను పక్కనపెట్టి చట్టాన్ని చేతిలోకి తీసుకుని న్యాయవాదులపై చేస్తున్న దాడులకు భవిష్యత్తులో పోలీసు అధికారులు మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిజిపి, హోంమంత్రి అనిత స్పందించి సంబంధిత పోలీసుల అధికారులపై చర్యలతో పాటు తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టానికి రూపకల్పన చేసి, వారి హక్కులను రక్షించాలని కోరారు.

నేటి నుంచి శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతర వేదికగా గురువారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకూ అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ సౌజన్యంతో దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి 100 మంది చేనేత కళాకారులు రూపొందించిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని, సందర్శకులు అధిక సంఖ్యలో వచ్చి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

దొంగతనాల జోరు

భయాందోళనలో ప్రజలు



ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో పెరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత సంవత్సరం నవంబర్ నెల నుంచి గాజువాకలోని ఏదో ఒక ప్రాంతంలో తరచూ దొంగతనాలు జరుగుతునే ఉన్నాయి. తాళాలు వేసి ఉన్న, కాలనీకి దూరంగా ఉన్న ఇళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. మింది గ్రామంలో ఇటీవల ఎవరూ లేనిఇంట్లో రాత్రి సమయంలో చోరీకి పాల్పడ్డారు. గడిచిన కొన్ని నెలలుగా స్క్రాప్ దుకాణాలు గాజువాక ప్రాంతంలో విపరీతంగా పెరిగాయి. దీంతో దొంగతనాల జోరు కూడా విపరీతంగా పెరిగింది. ఎన్నికల సమయంలో అడిగే వారు లేకపోవడంతో స్క్రాప్ దుకాణాలు విపరీతంగా పెరిగాయి. ఆ దుకాణాల్లో పని చేసే వారు చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇళ్లల్లో డబ్బులు, బంగారం కోసం దొంగతనం చేసే వారు కొందరైతే, పాన్ షాపులు, డైరీ పార్లర్లు వద్ద ఉన్న వస్తువులను చోరీ చేస్తున్నవారు మరికొందరు ఉంటున్నారు. శీలానగర్‌లో ఒక చిన్న వ్యాపారి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుకొని జీవిస్తున్నారు. ఆయన షాపులో 30 పాలు ప్యాకెట్లను చోరీ చేశారు. ఇటువంటి ఘటనలో ప్రతిరోజూ జరుగుతున్నా పోలీసుస్టేషన్ వరకు వెళ్లడంలేదు. చిన్నపాటి దొంగతనాలకు పోలీస్ స్టేషన్‌కు ఏమి వెళ్తామని ఉండిపోతున్నారు. పోలీసు సిబ్బంది కొరతతో రాత్రి సమయంలో పోలీసు బీట్లు కూడా లేకపోవడంతో చోరీలు పెరుగుతున్నాయి. పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు ఉన్న షాపులు ప్రాంతాల్లో మాత్రమే పోలీస్ బీట్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక పోలీసులు రాత్రి సమయంలో పటిష్టమైన గస్తీ ఏర్పాటుచేసి దొంగతనాలు నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

నూతన సంవత్సర వేళ సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం



మారికవలసలో కరపత్రాలు పంపిణీచేస్తున్న సిపిఎం నాయకులు



విసిసి ఆధ్వర్యాన న్యూఇయర్ గ్రీటింగ్ కార్డులను ఆవిష్కరిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

భారతదేశ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన నూతన సంవత్సర వేళ బుధవారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేస్తూ ప్రచారం నిర్వహించారు.

మధురవాడ : మారికవలస శారదానగర్‌లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మన దేశ రాజ్యాంగం విలువలను, మతసామరస్యం, లౌకిక విలువలు, ప్రజాస్వామ్యాన్ని, మనదేశ సంపదను ప్రజలందరూ కాపాడుకోవడం బాధ్యతగా ఉండాలని ఆకాంక్షించారు. శాంతి, సామరస్యం, తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాటాలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డి.అప్పలరాజు, బి.భారతి, డి.కొండమ్మ, కె.సుజాత, దివ్య, ఎం.కనకరాజు, ఆర్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : కంచరపాలెంలో జోన్ పరిధిలోని 42, 45, 48, 49, 52, 53, 54, 55, 56 తదితర వార్డుల్లో 2025 నూతన సంవత్సర ప్రభాత భేరి కార్యక్రమం ద్వారా తెల్లవారుజామున 6 గంటల నుంచి 11 గంటల వరకు సిపిఎం నాయకులు, సభ్యులు ఇంటింటికీ వెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రజలంతా కులమతాలకతీతంగా ఐకమత్యంతో మెలగాలని కోరారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలను విస్మరించి, ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టి అదాని, అంబానీ వంటి కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. గడప లోపలే మతం గడప దాటితే మనమంతా భారతీయులం అని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.పద్మ, యుఎస్ఎన్.రాజు, ఒ.అప్పారావు, ఎమ్.ఈశ్వరరావు, ఎస్.శ్రావణ్, విజయ, జి.శ్రీను, సిహెచ్.సుమిత్ర, ఎస్.సోమేశ్వరరావు, పి.రామారావు, బి.ప్రసాద్, ఆసనాల అప్పారావు, ఆసనాల రవి, ఆసనాల శ్రీను, పెండ్రాల సింహాచలం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం శ్రమజీవుల కాలనీ, బొడ్డపాలెం గ్రామాలలో విసిసి ఆధ్వర్యాన వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ న్యూ ఇయర్ గ్రీటింగ్ కార్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు కె.నాగరాణి మాట్లాడుతూ, స్నేహం, దేశాన్ని నిర్మించడానికి బాలలను ఏకంచేద్దాం అని పిలుపునిచ్చారు. పిల్లలదే ప్రపంచమని, వారిని స్వేచ్ఛగా ఎదగనిద్దాం, స్నేహపూరిత ప్రపంచాన్ని అందిద్దాం అని పేర్కొన్నారు. అసమానతలు లేని సమాజం కోసం శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందుకునేలా పిల్లలందరినీ ఐక్యం చేద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో యూన్సీ, చాందిని, చాణక్య, రామలక్ష్మి, గంగ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఎన్ఎస్ఆర్.నగర్ కాలనీలో కరపత్రాలను సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. సమస్యలపై ఐక్య పోరాటాలకు ముందుకు రావాలని డివైఎఫ్ఐ నాయకులు రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంచరపాలెం జోన్ నాయకులు గౌరీష్, అప్పలరాజు, వెంకన్న, కోటయ్య, యుఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కంచరపాలెం జోన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు



ఎన్ఎస్ఆర్.నగర్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఆర్ఇసిఎస్‌ను ప్రక్షాళన చేస్తాం

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి ఆర్ఇసిఎస్‌ను ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని తన తండ్రి సుబ్రహ్మణ్యం ఘాట్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఇసిఎస్ విద్యుత్ శాఖలో విలీనమైన తర్వాత ఉద్యోగులు, వినియోగదారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. అత్యధికంగా ఆదాయం వస్తున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తిరిగి ఆర్ఈసీఎస్ పరిధిలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపించే అవకాశం లేదని, అయితే అక్కడ ఇథనాల్ ఫ్యాక్టరీగాని, మరో పరిశ్రమగాని తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనకాపల్లి జీవీఎంసీ జోనల్ పరిధిలో మరమ్మతులు నిమిత్తం లక్షలాది రూపాయలు దుర్వినియోగం జరిగిందన్నారు. ప్రతి ఏటా మరమ్మతులకు లక్షల రూపాయలు వాడుతున్నట్లు చెబుతున్న అటువంటి ఛాయలు కనిపించడం లేదని పేర్కొన్నారు. దీనిపై అధికారులకు విజ్ఞప్తి చేశామని, విజిలెన్స్ ఎంక్వైరీ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. కమిషనర్‌తో ఇదే ఈ విషయం చర్చించడం జరిగిందన్నారు. పెరుగు బజారు రోడ్డు విస్తరణ పనులు జరగాల్సి ఉందని చెప్పారు. 22ఏలో కొన్ని భవనాలు ఉండటం, వారికి టీడీఆర్ ఇవ్వలేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని వెల్లడించారు. దీనిపై కలెక్టర్‌తో మాట్లాడం జరిగిందన్నారు. త్వరలోనే 22ఏ నుండి వాటిని తొలగించి అవసరమైన వారికి ఇవ్వాల్సిన టిడిఆర్‌లు ఇవ్వడం జరుగుతుందని, అందుకే ఆలస్యమైందని చెప్పారు. అనకాపల్లి జిల్లాకు మౌలిక సదుపాయాలు కల్పించవలసిన అవసరం ఉందన్నారు. అన్ని ప్రభుత్వ భవనాలు ఒకే చోట ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చెర్లోపలి ఖండం లేఅవుట్ పనులు త్వరలో ప్రారంభించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం అవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమరావతి, పోలవరం ప్రాజెక్టులను రెండు కళ్ళుగా భావించి నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నీలబాబు, కర్రి సత్యనారాయణ, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎన్నో ఆర్థిక సంస్కరణలు తెచ్చిన భారత జాతి ముద్దు బిడ్డ అని వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో బుధవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, పార్టీ మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, మలసాల కిషోర్, జాజుల రమేష్, మలసాల కుమార్ రాజా, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కంప్యూటర్, ప్రింటర్‌ను అందిస్తున్న చంద్రశేఖర్, సూర్యప్రభ

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు చంద్రశేఖర్ సూర్యప్రభలు మంగళవారం పాఠశాలకు రూ.25 వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు, ఎంఈఓ కెవిఎస్ఎన్.మూర్తి, శ్రీధర్ రెడ్డి, ఆచంట రవి, ఎస్‌జెవి.ప్రసాద్, కె.అప్పారావు, రామారావు, ఆనంద్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని గొండుపాలెంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ తొమ్మిదో వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీగౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు, 9 గంటలకు లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం నిర్వహించారు. అనంతరం భక్తి కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం తోడపెద్ద సేవ, రాత్రికి భజన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ


యుటిఎఫ్ డైరీ, కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, సంఘం నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రూపొందించిన నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను అనకాపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ముందుగా యుటిఎఫ్ నాయకులు కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ తప్పనిసరిగా ఉపాధ్యాయులంతా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, పి.గాయత్రి, జిల్లా కార్యదర్శులు జివిస్ ప్రకాష్, మాకిరెడ్డి రాజునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎంవి అప్పారావు, అనకాపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి బాబురావు, నాతవరపు సతీష్, సీనియర్ నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో తాబేలు మృతి

ఆందోళన చెందుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల సముద్రంలో తాబేలు మృతి చెంది బుధవారం తీరానికి కొట్టుకొచ్చింది. పరిశ్రమల కాలుష్యం వల్ల గతలో చేపలు చనిపోయిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. తీరానికి కొట్టుకొచ్చిన మృతి చెందిన తాబేలును బుధవారం మత్స్యకారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రతినిధి చేపల తాతయ్య మాట్లాడుతూ తరచూ చేపలు, తాబేళ్ళు చనిపోవడం వలన వాటి ఉనికి లేకుండా పోతుందని, దీని వల్ల మత్స్యకారులకు ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పూడిమడక సముద్ర తీరం వెంబడి 10 తాబేలు వరకు చనిపోయి కొట్టుకు వచ్చాయని తెలిపారు. మత్స్యకారుల జీవనానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మత్స్యకారులకు ప్రత్యామ్నాయంగా జీవనోపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.


తాబేలు మృతదేహం వద్ద నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

నేడు అదాని హైడ్రో పవర్ ప్లాంట్‌పై నిరసన

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు సమ్మెద సమీపంలో అదాని హైడ్రో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుండి జరిగే నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొంటారని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికులకు గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలం మూలపేట గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సరం వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కొత్త సంవత్సరంలోనైనా సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేసి కార్మికులు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్స్ వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సి హెచ్ అప్పలరాజు, సహాయ కార్యదర్శి చిన్ని గణేష్, చిన్ని చిన్న, గుమ్మాల నాగేశ్వరరావు, సత్తిబాబు, పల్ల నర్సింగరావు, తోట రమణ శేషు, కొండ బాబు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చర్ల రోడ్డు గోతులు పూడ్చరూ..

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని అచ్చర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు గోతులయమంగా ఉంది. అచ్చర్ల, కొత్త అచ్చర్ల, మోసయ్యపేట, సింగవరం, గోకివానిపాలెం గ్రామస్తులు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రోడ్డు గోతులుగా మారడంతో వారంతా ప్రయాణం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో అక్కడ అక్కడ గొయ్యిలు పూడ్చి వదిలేశారు. ఇప్పుడు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం బుచ్చయ్యపేట, రావికమతం మండలాల్లోని గ్రామాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో గోతులను తక్షణమే పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


గోతులతో ఉన్న అచ్చర్ల రహదారి

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు


జనసేన నేత రాంకీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కశింకోట నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి

నూతన సంవత్సర వేడుకలు బుధవారం అత్యంత ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీతో పాటు టిడిపి, జనసేన, వైసిపి నాయకుల వద్దకు ఆయా పార్టీల శ్రేణులు తరలి వెళ్లి పూలదండలు, పూల బొకేలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, సీఎం రమేష్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మల్ల సురేంద్ర, వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల పెదబాబు, ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘుబాబు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ తదితరులకు వారివారి కార్యాలయాలు, ఇళ్ల వద్ద ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

చోడవరం : స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుకు టిడిపి శ్రేణులతో పాటు వివిధ శాఖల ఉద్యోగులు పూల బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వైసిపి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, అతని సోదరుడు వెంకట సత్యనారాయణ టిడిపి శ్రేణులు, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజుకు ఆ పార్టీ శ్రేణులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కె.కోటపాడు : స్థానిక రామకృష్ణ ఫంక్షన్ హాల్లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్కువమంది పూల గుత్తులు కాకుండా పండ్లు, పుస్తకాలను ఎమ్మెల్యే బండారుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు బుధవారం డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, సిఐలు ఎం.గణేష్, సిహెచ్ నర్సింగ్‌రావు తదితరులు స్వయంగా కలిసి మొక్కను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుకు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావుకు, మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజుకు ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

సబ్బవరం : మండలంలోని కూటమి నేతలు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు, పెందుర్తి టిడిపి ఇన్చార్జ్ గండి బాబ్జికి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి పుష్పగుచ్చాలతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశాల మేరకు కూటమి నేతలు విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, బలిరెడ్డి అప్పారావు, ఇందల వెంకటరమణ, గండి దేముడు, గండి ముత్యాలనాయుడు, పిబివిఎస్ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు. వైసిపి పెందుర్తి నియోజకవర్గ నాయకులు గండి రవికుమార్ స్వగృహంలో జరిగిన వేడుకల్లో ఆయనకు ఆ పార్టీ నేతలు కర్రి బాబు, యడ్ల నాయుడు, సర్పంచులు దేడ్డం ప్రసాద్,



గాజువాక సమైక్య ఆపార్టుమెంట్‌లో కేక్ కట్ చేస్తున్న వెంకటేశ్వరరావు

పెద్దిశెట్టి శేఖర్ ఇతర నాయకులు పూల బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎంపీడీవో పి.పద్మజకు మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, మండల తహశీల్దారు బి.చిన్నకృష్ణకు రెవెన్యూ కార్యాలయ అధికారులు, సిబ్బంది, సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పరవాడ : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబుకు, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జికి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు, అనకాపల్లి, భీమిలి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణకు, గంటా శ్రీనివాసరావుకు కూటమి పార్టీల శ్రేణులు పూలమొక్కలు, పండ్లు, పుష్ప గుచ్చాలతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాధరావు, టిడిపి నేత కన్నూరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, మండలంలో పలు గ్రామాల నుండి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.


బత్తుల తాతయ్యబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కశింకోట : టిడిపి నేత గొంతుని శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, నైనమశెట్టి రమణరావు తదితరులు జనసేన జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మండలంలోని సోమవరం గ్రామంలో గొంతుని శ్రీనివాసరావుకు కర్రి దుర్గనాయుడు, మళ్ల బాబు, ఎంపీటీసీలు షేక్ దర్గా, బుదిరెడ్డి అప్పుడు, బుదిరెడ్డి గంగయ్య, జెర్రిపోతుల నూకినాయుడు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని ఎఎస్.పేట గ్రామంలో వైసిపి నియోజకవర్గం ఇన్చార్జి మలసాల భరత్ కుమార్‌కు జడ్పిటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీను, వైసిపి నేతలు మలసాల కిషోర్, ఎంపీటీసీ లగిశెట్టి భవాని గణేష్, గుమ్మడి నారాయణరావు, వైసిపి శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కోటవురట్ల : మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్యోగులు సిబ్బంది ఒకరికి ఒకరు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు, తంగేడు గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు , మండల టిడిపి నాయకులు జానకి శ్రీను ఇంటివద్ద నాయకులు కార్యకర్తలు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు, కార్యక్రమంలో తహశీల్దార్ తిరుమల బాబు, ఎంపిడిఓ కాశీ విశ్వనాథరావు, మండల వైసిపినాయకులు కిల్లాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలో. తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ సీతారామరాజు, ,తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్తు మాజీ కోఆప్షన్ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబులకు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్చాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తికి పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎయు విసి ఆచార్య జి.శశిభూషనరావుకు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు, క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపల్స్ పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కె.రాంబాబుకు, జడ్పిటిసి సభ్యులు గిరిబాబుకు కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పాండ్రంగిలో ఉన్న మాజీ మంత్రి ఆర్ఎస్‌డిపి.అప్పల నరసింహరాజుకు తెలుగుదేశం నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును పద్మనాభం తెలుగుదేశం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

గాజువాక : నవ్య చేతన మహిళా సేవా సంఘం ఆధ్వర్యాన ఉడా కాలనీలో కేలండర్‌ను అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవ్య చేతన సంఘం అధ్యక్షులు అండిబోయిన లక్ష్మి, అండిబోయిన అప్పారావు, వనము నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కొణతాల రామకృష్ణ, నాగిరెడ్డి తదితరులు

గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం రాత్రి నిర్వహించారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు కేక్ కట్ చేశారు. చిన్నపిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలు కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తౌడన్న, శ్రీనివాస్‌చౌదరి, రమణ, ఎం.రాజు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

మధురవాడ : భీమిలి నియోజకవర్గం ఎండాడ జనసేన కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆధ్వర్యాన కేకు కటచేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బివి.కృష్ణయ్య, శాఖరి శ్రీనుబాబు, నాగోతి నరసింహానాయుడు పాల్గొన్నారు.

సీతమ్మధార : నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. విశాఖ జిల్లా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను ఈ నూతన సంవత్సరంలో అయినా పరిష్కరించేలా కృషిచేయాలని డిఎంహెచ్‌ఒకు యూనియన్ సభ్యులు విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూర్ణెంద్రబాబు, నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు శశిభూషన్, ఆర్.సురేష్, వీరబ్రహ్మం పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ జగదీశ్వరరావు

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్‌ను దక్షిణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆరిలోవ : విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును జివిఎంసి 9, 10, 11, 12, 13 వార్డుల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడువాక సన్యాసిరావు, శ్రీమహాలక్ష్మి, గుండ్ర ఫణీంద్ర నాయుడు పాల్గొన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ పోర్టు ఛైర్మన్ అంగముత్తు, అధికారులు

ఎంవిపి.కాలనీ : తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. టిడిపి 17వ వార్డు యూనిట్ ఇన్‌ఛార్జి చిన్నిపిల్లి నరేంద్ర రెడ్డి, పార్టీ కార్యకర్తలు కాకి శివ, బోర పోలిరెడ్డి, దేముడు బాబు పాల్గొన్నారు. అనంతరం వారంతా టిడిపి రాష్ట్ర కార్యదర్శి చోడే పట్టాభిరాం, వివిఆర్‌డిఎ ఛైర్మన్ మానం ప్రణవ్ గోపాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వైసిపి జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, డిప్యూటీ మేయర్లు జియ్యని శ్రీధర్, కట్టుమూరి సతీష్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి రెడ్డి, బొడ్డేటి ప్రసాద్ పాల్గొన్నారు.

పోర్టులో...

ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యాన నూతన సంవత్సర వేడుకలు ఉద్యోగుల మధ్య సాంబమూర్తి ఆడిటోరియంలో బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు పోర్టు కేలండర్‌ను, ప్రత్యేకంగా రూపకల్పన చేసిన బ్రెయిలీ లిపి కేలండర్‌ను, టేబుల్ టాప్ కేలండర్, రిటైర్డ్ ఆఫీసర్స్ డైరీ-2025లను ఆవిష్కరించారు. వ్యక్తిగత క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే గుణం, నిజాయితీతో సంస్థ లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే, కార్యదర్శి టి.వేణుగోపాల్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పిఎస్ఎల్.స్వామి పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్‌లో..

హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. హెచ్ఎస్ఎల్ డిజిటల్ కేలండర్‌ను ఆవిష్కరించారు. సిఎమ్‌డి హేమంత్ ఖత్రి తదితరులు పాల్గొన్నారు.

కళా హాస్పిటల్‌లో..

ప్రముఖ వైద్యాలయంగా పేరొందిన కళా హాస్పిటల్‌లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకట రమణమూర్తి, డాక్టర్ కళావతి కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పి.వి.రమణ మూర్తి మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్య అవసరాల నిమిత్తం ఆసుపత్రికి వచ్చేవారికి నవ్వుతూ ఆత్మీయ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యశస్విని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పంచకర్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


పల్లాకు శుభాకాంక్షలు తెలుపుతున్న పరవాడ నేతలు


కళా ఆసుపత్రిలో జరిగిన వేడుకల్లో కళావతి, రమణమూర్తి

సిమెంట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా లోపం

- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లు
- కొరవడిన ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణ
- తిమ్మాపురం గుర్రంవారి దొడ్డి వాసుల ఫిర్యాదు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి ప్రత్యేక ప్రాధాన్యతగా గ్రామీణ ప్రాంతాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయితే వేగవంతంగా పనులు చేపట్టే క్రమంలో నిబంధనలు పాటించక, నాణ్యతాలేమి పనులు చేపట్టడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలుగ్రామాలలో ఒకేసారి సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతుండగా, కొన్ని గ్రామాలలో నాణ్యతాలోపం ఉందంటూ గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నారు. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆవేదన చెందుతున్నారు. తిమ్మాపురం గుర్రంవారి వీధిలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల పనుల్లో ఇసుక, పిక్క, సిమెంట్‌ను నిర్దేశిత పాళ్లలో వేయకుండా, తక్కువ సిమెంట్, మోతాదుకు మించి ఇసుక, పిక్క వేసి పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఈ మేరకు రోడ్ల పనుల నాణ్యతాలేమిపై అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉండే ఇంజనీరింగ్ అసిస్టెంట్ పని ప్రారంభంలో వచ్చి తగు సూచనలిచ్చి వేరే చోట పని వెళ్లేసరికి, సంబంధిత కాంట్రాక్టర్ నిబంధనలన్నీ గాలికొదిలేసి పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై మండల అసిస్టెంట్ ఇంజనీరు దుర్గశంకర్‌ను వివరణ కోరగా మండలంలో పలు గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అన్ని గ్రామాలలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షణలోనే పనులు చేపడుతుండగా, కొన్ని చోట్ల పనుల నాణ్యతపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఆయా రోడ్ల నాణ్యతను పరిశీలించి, నిర్ధారించుకున్నాకే బిల్లులు చెల్లిస్తామని, లేకుంటే నిలుపుదల చేస్తామన్నారు.


తిమ్మాపురంలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణం

వితంతువులకు వెంటనే పింఛన్ల మంజూరు


కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపిటిసి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలో కస్పా జగన్నాధపురం గ్రామంలో భర్తను కోల్పోయిన వితంతువు శరగడం నరసయమ్మకు నెలరోజుల్లోనే ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాలతో పింఛను మంజూరు చేయగా, బుధవారం స్థానిక ఎంపిటిసి భీశెట్టి శ్రీనివాసరావు లబ్ధిదారుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, వితంతువులకు నెలరోజుల్లోనే కొత్త పింఛను మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రాపేట జోగినాయుడు, స్కూల్ కమిటీ ఛైర్మన్ కర్రీ సంతోష్ కుమార్, బూత్ కమిటీ ఇన్చార్జ్ యల్లపు పెంటయ్య, కొట్యాడ రఘుకుమార్, మద్దాల ప్రసాద్, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు కాళ్ల హరి బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఆకుల రవి కిరణ్, కార్యదర్శి కర్రి ఈశ్వరరావు గౌరవాధ్యక్షులు శ్రీనాథ్ శేఖర్, రాపేట రాజశేఖర్, ఎల్లపు నూకరాజు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ : భర్త చనిపోయిన నెల రోజులకే వితంతువైన భార్యకు పింఛనును పంపిణీకి కూటమి ప్రభుత్వం అందిస్తోందని గొలుగొండ మాజీ జెడ్‌పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఏఎల్.పురం గ్రామానికి చెందిన చింతల ఎల్లమ్మ భర్త చింతల రాజులనాయుడు మరణించారు. ఈ మేరకు అతని భార్య ఎల్లమ్మకు వితంతు పింఛను మంజూరుకాగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నేతృత్వంలో వితంతువులకు నెల రోజులకే పింఛన్ అందజేస్తున్నామన్నారు.

జెడ్‌పిటిసి నిధులతో తాగునీటి బోరు


బోరు పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కోటవురట్ల : మండలంలో పాములవాక గ్రామంలో జెడ్‌పిటిసి నిధులతో తాగునీటి బోరు ఏర్పాటు పనులను బుధవారం మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ప్రారంభించారు, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటికి ఇబ్బంది లేకుండా ముత్యాలమ్మ గరువు ప్రాంతంలో బోరు ఏర్పాటుకు జెడ్‌పిటిసి సభ్యురాలు ఉమాదేవి నిధులు మంజూరు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బోరు ఏర్పాటుతో సమీప ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రజా సమస్యలపై అలుపెరగక పోరాటం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో అడిగర్ల రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జిల్లా మహసభలను జయప్రదం చేసిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు తెలిపారు. కార్మికులు, కర్షకుల పక్షాన నిలబడి సిపిఎం నిరంతరం పోరాడుతుందని, ప్రజా సమస్యలపై నిర్వహించే ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లడానికి ఈ మహాసభలు దోహదం చేస్తాయన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలని, ప్రైవేటు పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తీరప్రాంతాలలో విషవాయువును వెదజల్లే పరిశ్రమలను తీసుకొచ్చి ప్రజా జీవనాన్ని, పర్యావరణానికి నష్టం చేస్తున్నారన్నారు. దీన్ని వ్యతిరేకించిన ప్రజా పోరాటాలపై నిర్బంధం విధించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రొత్తల శంకరరావు, ఈరెల్లి చిరంజీవి, సాపిరెడ్డి నారాయణమూర్తి, ఎల్ గౌరి, కె. రామకృష్ణ, సత్తిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఉపమాకలో వెంకన్న దర్శనానికి వచ్చిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి : నూతన సంవత్సర పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. బుధవారం పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు గొట్టుముక్కల ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు స్వామిని దర్శించుకున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సప్పరం వాహనంపై తిరు వీధి సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస మూర్తులను వాహనం పైన, గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులను పల్లకిలోను వేయింపచేసి తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

3 నుంచి పద్మాపురం గార్డెన్ మూసివేత

ప్రజాశక్తి- అరకులోయ : . పర్యాటకులకు మరింత ఆకర్షించే విధంగా అరకులోని పద్మాపురం బొటానికల్ గార్డెన్‌ను ఆధునీకరిస్తున్న నేపథ్యంలో ఈనెల 3 నుంచి 11 వరకు దీనిని మూసేస్తున్నామని పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి..అభిషేక్ ప్రకటనలో తెలిపారు. పద్మాపురం గార్డెన్ సందర్శనకు పర్యాటకులు రావద్దని కోరారు. ఆధునీకరణ, విద్యుదీకరణ పనులు పూర్తయిన తర్వాత పర్యాటకులకు అనుమతిస్తామన్నారు.

భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి : సిపిఎం


మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ ఎం.రాజేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని వేంపాడులో భవన నిర్మాణ రంగ కార్మికులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, గత ప్రభుత్వం నిలుపుదల చేసిన సంక్షేమ పథకాలను అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా వాటి అమలుకు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. 1214 మెమోను రద్దుచేసి, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, ఇంటి నిర్మాణ యజమానులు నుండి ఒక శాతం సెస్సు వసూలు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాలని కోరారు. కార్యక్రమంలో కొల్లి తాతాజీ, శివాజీ, అల్లు నగేష్, ఈశ్వరరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఎస్ రాయవరం : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం పెట్టుగోళ్లపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆపేసిన బోర్డు పథకాలను పునరుద్ధరిస్తామన్న కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలన్నారు నూతన సంవత్సరంలోనైనా భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ప్రమాదాలు బారిన పడిన భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వం వైద్య సేవలు అందచేయాలని కోరారు. సిపిఎం సభ్యుడు ఎమ్ రాజేష్, రమణ, పక్కుర్తి గోవింద్ నూకరాజు, అప్పారావు, వెంకన్న, రమణ, దేముడు రాము పాల్గొన్నారు..


మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యనారాయణ

ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యదర్శిగా శ్రావణ్


సుతాపల్లి శ్రావణ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఉమ్మడి విశాఖజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శిగా నర్సీపట్నానికి చెందిన వ్యాపారవేత్త సుతాపల్లి శ్రావణ్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రావణ్ నియామకం పట్ల నర్సీపట్నం వ్యాపార వర్గాల్లో హర్షం వ్యక్తమౌతోంది. ఆయనకు పట్టణంలోని పలువురు వ్యాపారస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీ సహకారంతో వ్యాపారస్తుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, సంస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటానన్నారు.

పిఆర్‌టియు కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ రామారావు

ప్రజాశక్తి-కోటవురట్ల : స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద పిఆర్‌టియు కేలండర్‌ను ఎంఇఒ రామారావు, యూనియన్ ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. అనంతరం పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు కార్యక్రమంలో పిఆర్‌టియు ప్రతినిధులు అబ్దుల్లా, డేవిడ్, ప్రతాప్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

భూపరిహారం చెల్లించకుండా పనులు చేపట్టొద్దు

- చెట్లు తొలగింపును అడ్డుకున్న బాధిత నిర్వాసితులు
- పోలీసు రక్షణలో అధికారుల దూకుడుపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు పనులను నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించకుండా అధికారులు చేపట్టడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు ఆక్షేపించారు రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో సేకరించిన భూములలో మూడు రోజులుగా పోలీసులు పహారా నడుమ రెవెన్యూ, ఎపిఐఐసి అధికారుల ఆధ్వర్యంలో మౌలిక వసతులు కల్పనకు పనులు జరుగుతున్నాయి.

బుధవారం. రాజయ్యపేటలో సర్వేనెంబర్ 290లో ఏడు ఎకరాల శ్మశానవాటికతోపాటు, నిర్వాసిత రైతుల సాగు భూములలో కొబ్బరి, జీడిమామిడి చెట్లను తొలగిస్తూ, పనులు చేపట్టగా, బాధితులు ు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న అప్పలరాజు, సిపిఎం నేతలు స్థానిక మత్స్యకారులతో కలిసి తొలగించిన తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రాజయ్యపేటలో సుమారుగా 15 వేల మంది జనాభా ఉన్నారన్నారు .ఏడు ఎకరాల శ్మశానవాటిక స్థలంలో కొబ్బరి, జీడి, యూకలిప్టస్, తాటి చెట్లను పెద్ద యంత్రాలతో తొలగించారన్నారు. అంతే కాకుండా మైలపల్లి మసేనమ్మ కు చెందిన ఎకరం జీడి మామిడి తోట, బొంది కొండమ్మకు చెందిన రెండెకరాల్లో జీడి మామిడి తోట, బొంది పెంటయ్య కు చెందిన రెండెకరాల్లో జీడి మామిడి తోటలకు నష్టపరిహారం చెల్లించకుండా యంత్రాలతో ఆయా భూముల్లోని చెట్లను పరిహారం చెల్లించకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. నిర్వాసిత రైతులు పరిహారం కోసం మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా, వారి అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ పనులు చేపట్టడం సరికాదన్నారు. బాధితులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం పరిహారం,ప్యాకేజీ చెల్లించాలని, తర్వాత పనులకు ఉపక్రమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎం.మహేష్ బాబు, ఎం.భయ్యన్న,శివాజీ, రాజు, నవీన్,కె.భూలోక,జీ.కాశీ పాల్గొన్నారు.




సిఐ, ఇతర పోలీసుల రక్షణలో పనులు పర్యవేక్షిస్తున్న తహశీల్దారు నరసింహమూర్తి



మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

వస్త్రాల పంపిణీ



వస్త్రాలు అందజేస్తున్న రాయి రమేష్ దంపతులు

ప్రజాశక్తి -నక్కపల్లి : పాయకరావుపేట మండలం,అరట్లకోట అప్పారావు మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని,ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ గెడ్డం జయనాథ్ కుమార్ దేవుని వాక్య సందేశాన్ని అందించారు. చర్చిలో పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. క్రైస్తవులకు నూతన వస్త్రాలను సంఘ వ్యవస్థాపకులు రాయి రమేష్ బాబు, సమత దంపతులు పంపిణీ చేశారు.

కోలాటం కళాకారులకు చీరలు



చీరలను పంపిణీ చేస్తున్న జ్యోతికుమార్

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : నూతన సంవత్సరం సందర్భంగా మేజర్ పంచాయితీ తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామానికి చెందిన కోలాటం మహిళా కళాకారులకు చీరలు పంపిణీ చేసినట్లు జనసేన యువ నాయకులు లింగంపల్లి జ్యోతికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం గోకులపాడు రామాలయం వద్ద జ్యోతికుమార్ ఆర్థిక సహాయంతో 50 మంది మహిళా కళాకారులకు చీరలు పంపిణి చేపట్టారు. నేటి కాలంలో గ్రామీణ ప్రాంతాలలో కనుమరుగవుతున్న కళారూపాలకు ప్రాణప్రతిష్ట చేస్తున్న మహిళలకు ప్రోత్సాహమందించాలనే లక్ష్యంతో చిరు సాయంగా వారికి చీరలను అందజేసినట్లు జ్యోతికుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ జనసేన నేతలు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహార ఉత్పత్తుల అమ్మకాలు



కూరగాయలు కొంటున్న ప్రజలు

ప్రజాశక్తి- మాడుగుల : సేంద్రియ ఎరువులతో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఆహార ఉత్పత్తులకు మాడుగులలో మంచి స్పందన లభిస్తోంది. ప్రతి బుధవారం మాడుగుల శ్రీదేవి అమ్మవారు ఆలయం ఎదురుగా గ్రామస్థులు సహకారంతో ప్రకృతి వ్యవసాయం విధానంలో పండిచిన ఆకుకూరలు, కూరగాయలు, దుంపజాతి, పండ్లజాతి ఉత్పత్తులు, చిరుధాన్యాలు, అన్ని రకాల పంటలు విత్తనాలు, కషాయాలు, అమృతాల అమ్మకాఇలను చేపడుతున్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పండిచిన ఉత్పత్తుల అమ్మకాలను స్టాల్స్ ఏర్పాటు చేసి చేపట్టడంతోపాటు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, లాభాలను ప్రజలకు వివరించి చెబుతుండడంతో పలువురు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, బి.దేవి రాము, కొండాజీ, నాగేశ్వరరావు, చిరంజీవి,నాయుడు, సన్యాసిరావు, రాధ, సుజాత, పార్వతి సమక్షంలో ప్రారంభించిన స్టాల్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



సిఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : పట్టణంలోని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు 14మందికి సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ, వైద్యానికి ఆర్థికస్తోమత లేని బాధితులు సాయం కోసం అర్థించగా, స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ అయ్యన్నపాత్రుడు సిఫార్సులతో తున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైంది. అందజేశారు. ఆరు నెలల కూటమి ప్రభుత్వం కాలంలో నియోజకవర్గంలోని 14 మందికి సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు మంజూరులో అయ్యన్నపాత్రుడు కృషి చేశారు.ఈ మేరకు నాతవరం మండల కేంద్రానికి చెందిన కొమ్మన శ్రీనివాస్‌కు రూ.1.80లక్షలు, గొలుగొండ మండలం కొత్త ఎల్లవరం గ్రామానికి చెందిన బేబీ గణేశ్వరికు రూ.1.53లక్షల సిఎం సహాయనిధి సాయం చెక్కులు అందజేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఆరోగ్యం దేశాభివృద్ధికి మూలమని, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం ఆశాజ్యోతి కావాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాతవరం మండల టిడిపి అధ్యక్షులు నందిపల్లి రమణ, అంకంరెడ్డి మాణిక్యం, యర్రా కాశియ్య, కొత్త ఎల్లవరం సర్పంచ్ రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సత్కారం



ఎమ్మెల్యే రాజును గజమాలతో సత్కరిస్తున్న ఎంపిటిసి

ప్రజాశక్తి-రోలుగుంట : చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజును రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గజమాలతో సత్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి,నాయకులు, పంచాడ చంద్ర, పాల్గొన్నారు.

యథేచ్ఛగా బెల్ట్ షాపులకు మద్యం!

- సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్
- చోద్యం చూస్తున్న అధికారులు



స్కూటీపై మద్యం బాక్సులను తరలిస్తున్న వైనం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో మద్యం దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలకు నీళ్ళొదుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నూతన సంవత్సర వేడుకలలో నిబంధనలన్నీ అటకెక్కించి, గ్రామాల్లోని బెల్ట్‌షాపులకు యథేచ్ఛగా మద్యం సరఫరా చేశారని అంటున్నారు. స్కూటీలు, బైక్‌లు, ఆటోల్లో బాహాటంగా కేసుల కొద్దీ మద్యాన్ని గ్రామాలకు చేరవేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తూ పట్టించుకోకపోవడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. వ్యాపార కేంద్రమైన అడ్డురోడ్‌లోని అనుమతి పొందిన మద్యం ఉకాణం నుంచి బుధవారం ఉదయం బెల్టుషాపుకు స్కూటీపై మద్యం తరలిస్తున్న ఫోటో సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొడుతోంది. స్కూటీపై పట్టపగలే, బహిరంగంగా మద్యం తరలిస్తున్నారంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక ప్రక్క ప్రభుత్వం గ్రామాల్లో బెల్టుషాపులు లేకుండా చేస్తామని ప్రకటిస్తుంటే, మరోవైపు ఈ విచ్చలవిడి తనం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్, పోలీసుశాఖలు దృష్టి పెట్టి గ్రామాల్లో బెల్ట్‌షాపులు, వాటికి మద్యం సరఫరా చేస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.